5న జాబ్‌మేళా

శ్రీకాకుళం : సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యాన సెప్టెంబరు ఐదో తేదీన సీతంపేట పిఎంఆర్‌సి భవనంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ వి.వి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. అమెజాన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొనే జాబ్‌మేళాలో 300 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన అన్ని కులాలకు చెందిన 18 నుంచి 30 ఏళ్ల యువతీ యువకులు అర్హులని తెలిపారు. అభ్యర్థులకు ఇంగ్లీష్ చదవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,800 జీతం పాటు అదనంగా ఇన్సెంటివ్ ఉంటుందని తెలిపారు. నెలకు 22 రోజులు మాత్రమే పనిదినాలు, రోజుకు పది గంటలు పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు నెల్లూరు సమీపంలో తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885108092 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

సంతబొమ్మాళి : మరువాడ వద్ద సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

తప్పిన ముప్పు

- కళింగపట్నం వద్ద తీరం దాటిన వాయుగుండం
- అత్యధికంగా సంతబొమ్మాళిలో 66.2 మి.మీ వర్షపాతం నమోదు
- నేడూ వర్షాలు కురిసే అవకాశం
- అల్లకల్లోలంగా సముద్రం
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు
- నేడు విద్యాసంస్థలకు సెలవు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, బూర్జ, పోలాకి, సంతబొమ్మాళి, రణస్థలం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శనివారం అర్ధరాత్రి కళింగపట్నం సమీపంలో తీరం దాటింది. తీరం దాటిన సమయంలో భారీ వర్షాలు, గాలులతో జిల్లాకు ముప్పు పొంచి ఉంటుందని భావించినా, ఆ ప్రమాదం తప్పడంతో జిల్లా ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే దీని ప్రభావంతో ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సంతబొమ్మాళిలో 66.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సోమవారం కూడా జిల్లాలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. వాయుగుండం ప్రభావం వల్ల సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఎగసిపడుతున్నాయి. మరోవైపు నేడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సెలవు ప్రకటించారు.

వాయుగుండం కళింగపట్నం వద్ద తీరం దాటిన సమయంలో, తర్వాత గాలులు, పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అధికార యంత్రాంగం చేపట్టిన ముందస్తు చర్యల వల్ల ప్రాణ, ఆస్తినష్టం తప్పింది. శనివారం రాత్రి వీచిన గాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. తీరం గార మండలం సిఎస్‌పి రహదారిలో రామకృష్ణాపురం వద్ద భారీ వృక్షం నేలకూలంది. రాత్రివేళ రహదారికి అడ్డంగా చెట్టు పడిపోవడంతో ప్రమాదం తప్పింది. అక్కడి సమీపాన గల 11 కెవి విద్యుత్ లైన్‌లో తీగలు తెగిపోవడంతో శ్రీకూర్మం, ఒప్పంగి ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం ఉదయం ఈ లైన్లను విద్యుత్‌శాఖ అధికారులు పునరుద్ధరించారు. మరోవైపు ఆదివారం జిల్లావ్యాప్తంగా సరాసరి 25.0 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సంతబొమ్మాళి మండలంలో 66.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, జి.సిగడాంలో అత్యల్పంగా 9.2 మి.మీ నమోదైంది. వర్షాలకు శ్రీకాకుళం నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు ప్రవహించడంతో జనం అవస్థలు పడ్డారు. ఆర్‌టిసి కాంప్లెక్స్, డేఅండ్‌నైట్ జంక్షన్, రైతుబజారు, బొందిలీపురం, చంద్రమహల్ రోడ్డు పరిసరాల్లో కాలువల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. దీనికి తోడు ఇటీవల కాలువల్లో పూడికతీత పనులు చేపట్టిన నగరపాలక సంస్థ అధికారులు చెత్త, మట్టి నిల్వలను రోడ్లపై విడిచిపెట్టడంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. పోలాకి మండలంలో 6,250 ఎకరాల్లో వరి పంట నీటమునిగినట్లు అధికారులు గుర్తించారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి, రీజనల్ ఇంటర్మీడియట్ అధికారికి తగిన ఆదేశాలు జారీ చేశారు.

తీర ప్రాంతాల్లో అధికారుల పర్యటన

బూర్జ మండలంలోని నారాయణపురం ఆనకట్టను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పైనుంచి వరదలు వచ్చే ప్రమాదం ఉందని, దీనివల్ల లోతట్టు గ్రామాలు ముంపునకు గురయ్య అవకాశముందా అని ఆరా తీశారు. మండలంలోని అల్లిన వద్ద కరకట్టలు లేకపోవడంతో ప్రమాదం ఉందని సిబ్బంది తెలిపారు. ఆమదాలవలస మండలంలోని బెలమాం వద్ద కూడా ఈ సమస్య ఉందని చెప్పారు. నాగావళి నదీపరివాహక గ్రామాల్లో అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిపై సమాచారం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ ఈశ్వరమ్మ, నారాయణపురం ఆనకట్ట జెఇ రాంబాబు, ఇఒఆర్‌డి విజయలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ సంతోష్ కుమార్ తదితరులున్నారు.

రణస్థలం మండలంలో పోతయ్యపేటలో తీర ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు సముద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీనిచ్చారు. ఆయన వెంట కొవ్వాడ ప్రత్యేక ఉప కలెక్టర్ లక్ష్మణరావు, తహశీల్దార్ ప్రసాదరావు తదితరులున్నారు.

గార మండలం కళింగపట్నం, బందరువానిపేటలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పర్యటించి సహాయక చర్యలపై ఆరా తీశారు. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా ప్రజా రవాణాకు అంతరాయం లేకుండా అన్ని సహాయక చర్యలు అందించడానికి ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సహాయక చర్యల్లో పాల్గొన్న బృందాలకు అవసరమైన లైటింగ్ సామగ్రి, లైఫ్ జాకెట్లు, రోపులు, కట్టర్లు, ఇతర పరికరాలు, సామగ్రిని సిద్ధంగా ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ కంట్రోల్ రూమ్ 100, 6309 990933 ఫోన్ నంబరును ప్రజలు సంప్రదించాలని కోరారు. ఆయన వెంట డిఎస్‌పి వివేకానంద్, సిఐలు పైడిపు నాయడు, ఇమ్మాన్యుయల్ రాజు, ఎస్ఐ కృష్ణప్రసాద్ తదితరులున్నారు.

పోలాకి మండలం పల్లిపేట, డోల, సుసరాంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. నీటి మునిగిన పొలాల్లో నీరు దిగువకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని వంశధార అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అవసరమైన మందులు ఉన్నాయా, లేదా?.. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా అనే అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఆర్.వెంకట్రామన్, తహశీల్దార్ ఎం.సురేష్ కుమార్, ఎంపిడిఒ ఉషశ్రీ, వంశధార జెఇ శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షపాతం వివరాలు

మండలం	కురిసిన వర్షం (మి.మీల్లో)
సంతబొమ్మాళి	66.2
లావేరు	35
రణస్థలం	34.2
ఆమదాలవలస	38.8
వజ్రపుకొత్తూరు	40.4
జలుమూరు	35
శ్రీకాకుళం	34
పోలాకి	32.2
నందిగాం	31.6
గార	21.2
టెక్కలి	31
కోటబొమ్మాళి	27.8
ఎచ్చెర్ల	19.8
పాతపట్నం	26.4
మందస	24.4
మెళియాపుట్టి	25.6
పలాస	27.2
సారవకోట	24.6
కొత్తూరు	18.6
సరుబుజ్జిలి	18.4
కంచిలి	16.4
పొందూరు	15.2
ఎల్ఎన్‌పేట	16
ఇచ్ఛాపురం	15.2
నరసన్నపేట	14.8
సోంపేట	12.8
బూర్జ	12.2
హిరమండలం	13.8
కవిటి	12.2
జి.సిగడాం	9.2

బూర్జ : ఆనకట్టను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పోలాకి : అధికారులతో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

వాయుగుండం కారణంగా జిల్లాలో భారీ వర్షాల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్నిరకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల నోడల్ అధికారులు, ఆర్‌డిఒలతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల ప్రభావం, నదులు, చెరువుల్లోని నీటిమట్టం, గండ్లు పడే అవకాశమున్న ప్రధాన కాలువల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వర్షాలు కొంత తెరిపినిచ్చినా, ఇంకా కురిసే అవకాశం ఉందన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో నీరు నిల్వ ఉన్న చోట్ల మోటార్ల సహాయంతో తొలగించాలన్నారు.

సహాయ సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పోలాకి : సుసరాంలో నీటమునిగిన తంపర భూములు

శ్రీకాకుళం : శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు

యుద్ధాలు కాదు... శాంతి కావాలి

- పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను ఖండించాలి
- సిఐటియు ఆధ్వర్యాన శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రపంచానికి ప్రస్తుతం కావాల్సింది శాంతి గానీ యుద్ధాలు కావని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవంలో భాగంగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడిని ఖండిస్తూ, అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యుద్ధాలు వద్దు - శాంతి కావాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్ వద్ద ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదాన్ని, పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పాలస్తీనా, ఉక్రెయిన్‌లో యుద్ధాలను అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదం ఎగదోసిందన్నారు. ఇజ్రాయెల్‌కు అమెరికా ఆయుధాలను సరఫరా చేసి ఇప్పటికి 40 వేల మందికి పైగా పాలస్తీనా పౌరుల ప్రాణాలను తీయడానికి కారణమైందన్నారు. మరోవైపు యుద్ధ విరమణకు తాము ప్రయత్నాలు చేస్తున్నట్లు నాటకం ఆడుతోందని చెప్పారు. ఈ నాటకంలో మోడీ ప్రభుత్వం కూడా భాగస్వామిగా చేరిందని విమర్శించారు. రష్యా చుట్టుపక్కల దేశాలను తమ పరిధిలోకి తెచ్చుకుంటూ ఆ దేశానికి రక్షణ లేకుండా చేయాలని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర సామ్రాజ్యవాద దేశాలు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగానే రష్యా పక్కనే ఉన్న ఉక్రెయిన్‌ను 'నాటో' కూటమిలో చేర్చుకోవడానికి సిద్ధమైందన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రష్యా యుద్ధానికి నెట్టబడిందన్నారు. పైకి ఉక్రెయిన్‌తో యుద్ధంలా కనబడుతున్నా సామ్రాజ్యవాద దేశాలకు, రష్యాకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. సోషలిస్టు చైనా తమను మించి బలమైన దేశంగా మారుతుండడాన్ని అమెరికా తదితర దేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయని చెప్పారు. చైనాను ఒంటరి చేయడానికి అమెరికా అన్నిరకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ ప్రయత్నంలో మోడీ ప్రభుత్వం భాగస్వామిగా చేరడాన్ని వ్యతిరేకించాలన్నారు. చైనా, ఇండియా చేతులు కలిపితే మన దేశానికి ఎక్కువ లాభమని తెలిసినా మోడీ ప్రభుత్వం, అమెరికాతో చేతులు కలిపి దేశానికి నష్టం చేస్తోందన్నారు. సోషలిస్టు క్యూబాను అమెరికా 60 ఏళ్లుగా ఆర్థికంగా దివాళా తీయించే ప్రయత్నం చేస్తోందని గుర్తుచేశారు. క్యూబాకు కావాల్సిన ఆహారం, నిత్యావసర సరుకులు, మందులు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోకుండా అమెరికా అపేసిందన్నారు. చిన్న పిల్లల మరణాలు అతి తక్కువ ఉన్న దేశాల్లో క్యూబా ఒకటని, అమెరికా ఆంక్షలతో ఇప్పుడు అక్కడ మరణాలు పెరుగుతున్నాయని తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాదం అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రధాన శత్రువుగా మారిందన్నారు. ఈ పన్నాగాలను కార్మికవర్గం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, ఎ.మహాలక్ష్మి, ఎన్.వి.రమణ, ఆర్.ప్రకాష్, పలు కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మందస : మందసలో సిఐటియు ఆధ్వర్యాన నిర్వహించిన శాంతి ర్యాలీలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, నాయకులు కె.కేశవరావు, బి.వెంకటేశం, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

మందస : ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

వినాయక మండపాలకు సింగిల్ విండో

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 7995095800 మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా Hi అని సందేశం పంపిస్తే, నిరభ్యంతర పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్‌కు వస్తుందని పేర్కొన్నారు. తర్వాత https://ganeshutsav.net వెబ్‌సైట్‌లో వినాయక మండపం ఏర్పాటు చేసే కమిటీ సభ్యుల వివరాలు, ప్రదేశం, ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ నిమజ్జనం ఎక్కడ, ఏ సమయంలో, ఏ వాహనం ద్వారా చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకు వెళ్తుందని తెలిపారు. ఎస్‌హెచ్‌ఒ ఆధ్వర్యాన మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ సిబ్బంది బృందంగా ఏర్పడి మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. మండపాల ఏర్పాటు నియమాలకు అనుగుణంగా ఉంటే మీసేవలో చలానా కట్టి https://ganeshutsav.net/applicationStatus, ఫోన్ నంబరును నమోదు చేస్తే నిరభ్యంతర పత్రం, నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ అవుతుందని వివరించారు. నిరభ్యంతర పత్రం, క్యూఆర్ కోడ్‌ను లేమినేషన్ చేసి, ఉత్సవ మండపంలో తనిఖీలు చేపట్టేందుకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఉత్సవాలను సక్రమంగా నిర్వహించేందుకు నిర్వాహకులు కింది నియమాలను పాటించాలని సూచించారు.

- ఉత్సవ విగ్రహాలను రోడ్డుకు అంతరాయం లేకుండా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలి.
- కమిటీ సభ్యులు ఆధార్, చిరునామా, ఫోన్ నంబర్లు తీసుకోవాలి. పూజ దినముల వివరాలు తీసుకోవాలి.
- వినాయక చవితి మండపాల వద్ద ఎక్కువ శబ్ద కాలుష్యం చేసే స్పీకర్లను ఉపయోగించరాదు. స్పీకర్లను ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే వినియోగించాలి.
- ఉత్సవ మండపాల వద్ద విగ్రహాలకు భద్రతగా కమిటీ సభ్యులు రాత్రులు మండపాల వద్దనే ఉండాలి.
- వినాయక నిమజ్జనం చేసే సమయం, రూట్ మ్యాప్‌ను ముందుగా పోలీసులకు తెలియజేయాలి.
- వినాయక నిమజ్జనానికి ఉపయోగించే వాహనం వివరాలు, రికార్డులు, డ్రైవరు లైసెన్సు తీసుకోవాలి. మద్యం సేవించి వాహనం నడపరాదు. డ్రైవరు వద్ద అండర్ టేకింగ్ లెటర్ తీసుకోవాలి.
- మండపాల వద్ద ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా వాహనాలను ఒక పక్కగా పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేయాలి.
- దీపారాధన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించకుండా నిర్వాహకులు ముందుజాగ్రత్తలు తీసుకోవాలి.
- మండపాల వద్ద గానీ ఊరేగింపుల్లో గానీ బాణసంచాను ఉపయోగించరాదు.
- నిమజ్జనం సమయంలో అశ్లీల డాన్సులు గానీ డిజె శబ్దాలు ఎక్కువగా ఉండకూడదు. వ్యక్తులను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించకూడదు.
- బలవంతపు చందాలు, వసూళ్లు, దర్శనాల టిక్కెట్లు పెట్టరాదు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే డయల్ 100కి గానీ 6309990933 నంబరుకు వాట్సాప్ ద్వారా సమాచారాన్ని అందించాలి.
- ప్రతి మండపానికి సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి ఒక పోలీస్ కో-ఆర్డినేటర్‌ను నియమించడం జరుగును.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రంగులు ఉపయోగించిన విగ్రహాలను పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ఉపయోగించరాదు. మట్టితో తయారు చేసిన విగ్రహాలను ఉపయోగించాలి.
- హుండీ రాత్రిపూట మండపంలో ఉంచరాదు. విగ్రహం వద్ద పాయింట్ బుక్, రిజిస్టర్ ఉండాలి.
- కమిటీ సభ్యులు రాత్రి సమయంలో మండపం వద్ద కాపలాగా ఉండాలి. నిర్వాహకులు సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- నిమజ్జనం నిర్దేశించిన సమయంలో ఊరేగింపు ప్రారంభించి, నిర్దేశించిన ప్రాంతంలో రాత్రి పది గంటల్లోపు ముగించాలి.
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకల నిర్వహణకు నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలి.

సిపిఎస్ ఉద్యోగుల బ్లాక్ డే

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నిరసన తెలుపుతున్న సిపిఎస్ ఉద్యోగులు

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను ప్రవేశపెట్టి 20 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఆదివారం బ్లాక్ డేగా పాటిస్తూ సిపిఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్న పోరాట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షులు గురుగుబెల్లి భాస్కరరావు మాట్లాడుతూ 2004 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ స్కీమ్ అమలు చేస్తున్నాయని చెప్పారు. సిపిఎస్ రద్దు కోసం ఉద్యమిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వం సిపిఎస్‌కు బదులుగా జిపిఎస్ అంటూ ఉద్యోగులను మోసం చేస్తే, కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఇప్పుడు పేరు మార్చి యుపిఎస్ అమలు చేస్తామని చెప్తోందని విమర్శించారు. ఉద్యోగులను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు లాభం లేని కార్పొరేట్ల షేర్ మార్కెట్ మాత్రమే లాభాన్ని చేకూర్చే యుపిఎస్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తూ యుపిఎస్ వంటి అంకెల గారడీ చేసే పెన్షన్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎ.షణ్ముఖరావు, బి.శ్యామ్ కుమార్, బి.సత్యనారాయణ, జి.రమణ, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణపై ప్రత్యేక దృష్టి

మత్స్యశాఖ కమిషనర్ డోల శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

మత్స్యకారుల వలసల నివారణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు మత్స్యశాఖ కమిషనర్ డోల శంకర్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం మండలంలోని పెద్దగనగళ్లవానిపేటలో పర్యటించి మత్స్యకారులతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందజేసేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కేరళలో నడుపుతున్న బోట్ హౌసింగ్ గానీ డ్యూయల్ బోట్ల ద్వారా స్కోడా డైవింగ్, సముద్రంలో టూరిజం యాక్టివిటీలపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆన్ బోర్డ్‌పై ఫుడ్ రెస్టారెంట్స్‌తో పర్యాటకులను ఆకర్షించేందుకు మత్స్యకారులకు అవసరమైన నైపుణ్యాభివృద్ధికి వినూత్న పథకాలు ప్రవేశపెడతామన్నారు. వలసల నివారణకు అలంకరణ చేపల పెంపకం, స్థానికంగా పర్యాటకాభివృద్ధి, సివిడ్ కల్చర్, ఆక్వాకల్చర్ వినూత్న పద్ధతుల్లో ఆచరించి అధిక లాభాలు పొందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ పి.శ్రీనివాసరావు, ఎఫ్‌డిఒ కె.గంగాధరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ వై.సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ బర్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
I.P.No.8 /2023.

Between :
Sunkari Satish Kumar ...PETITIONER
And:
Baratam Srinivasarao and 13 others ...RESPONDENTS

To,
RESPONDENT NO.14
VenkataNagaraju, S/o.Raju, Hindu aged about 50 years, RMP doctor, R/o.Door no.55-5, Bazaar veedhi, Narasannapeta town and mandal, Srikakulam district.

NOTICE

Please take notice that the above matter is posted on Dt18/09/2024 for your appearance. You are hereby directed to appear before the Hon'ble Court on **Dt.18-09-2024 at 10.30 A.M.** either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence.

// By Court Order //

INJARAPU DHANUNJAYARAO
ADVOCATE FOR PETITIONER,
SRIKAKULAM.

బహిరంగ వేలం ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, శ్రీకాకుళం
EP.27/2019 in OS.262/2016

Between:
కోరుకొండ అరుణ కుమారి ...DHR/వాది
And:
1. బలగ శ్రీనివాసరావు (లేటు)
2. బలగ ధనలక్ష్మి ...JDR/ప్రతివాది

పై నంబరు సూట్ అమలులో JDR స్వాధీన హక్కు అనుభవములో గల షెడ్యూలు దాఖలా ఆస్తిపై, పై కోర్టులో 21-9-2024 ఉదయం 10-30 ని॥ల నుండి సాయంకాలం 5-00ల వరకు బహిరంగంగా వేలం వేయబడును. కావలసినవారు వచ్చి పాడుకొనవచ్చును. వేలం షరతుల గురించి శ్రీకాకుళం కోర్టు సెంట్రల్ నజారత్ వారిని అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూల్

శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్-డి, శ్రీకాకుళం మున్సిపాలిటీ, బలగ వార్డు, బలగ పెద్దవీధి, టి. ఎస్. నం . 49లో భాగమై, ఆర్. ఎస్. నం . 286లో భాగమైనట్టిన్ని 0.05 సెంట్లు లేక 0.020 హెక్టార్లు విస్తీర్ణం గల ఖాళీ స్థలము .

హద్దులు :
తూర్పు : : సాదు అప్పారావు గారి తాలూకా ఖాళీ స్థలం
పడమర: ఈ స్థలముకున్నూ చిట్టి రాజగోపాలరావు గారి స్థలముకున్నూ చిట్టి వాళ్ల బాగారుల అందరకున్నూ సాదు వరలక్ష్మి బాగారులు అందరకున్నూ యేటి గట్టుకు పోవుటకు రస్తాగా ఉపయోగించుకొనుచున్న స్థలం
దక్షిణ : చిగురుపల్లి సుమతి గారి తాలూకా ఖాళీ స్థలం
ఉత్తరం : ఈ స్థలముకున్నూ, చిట్టి వాళ్ల బాగారులు అందరకున్నూ, చిట్టి వరలక్ష్మి బాగారుల అందరకున్నూ యేటి గట్టుకు పోవుటకు రస్తాగా ఉపయోగించు కొనుచున్న స్థలమున్నూ, చిట్టి తవుడు మాస్టారు గారి స్థలమున్నూ

DHR విలువ : 7,95,473.00
అమీను విలువ : 10,00,000
JDR విలువ : నిల్

శ్రీకాకుళం,
తే॥ 02/9/2024.

కె. అరుణకుమారి
DHR
సెల్: 8639472910

పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎమ్మెల్యే ఈశ్వరరావు పర్యటన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని అల్లివలసలో ఆదివారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారులు బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అధికారులు సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మూడు రోజుల పాటు వేటకు వెళ్లొద్దని సూచించారు. వర్షాల కారణంగా నష్టపోయిన మత్స్యకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లెంక శ్యాం, పిసిని జగన్నాథం నాయుడు, లెంక ప్రభ, దుమ్ము అశోక్, గొర్లె సాయి, సుంకరి దానిజయ్, బస్వ గోవిందరెడ్డి, మైలపల్లి పోలీసు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న రాష్ట్ర నాయకులు

అపుస్మా జిల్లా అధ్యక్షునిగా లక్ష్మణరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా శ్రీసాయి విద్యా సంస్థల అధినేత బూరగాపు లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శిగా సన్‌స్కూల్ డైరెక్టర్ శిల్లా మోహనరావు, కోశాధికారిగా ఇన్‌స్పైయిర్ స్కూల్ డైరక్టర్ అన్నెపు అనంతరావులు ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా రాష్ట్ర సంఘం నుంచి ఖాసిం, పరిశీలకులుగా రాష్ట్ర కోశాధికారి ఎంవి రావు, విశాఖ జిల్లా కార్యదర్శి సత్యన్నారాయణ, జోనల్ ఇన్‌ఛార్జి మధు హాజరైయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గాన్ని వారు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, సవాళ్లను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు.

సిపిఎస్‌కు ముగింపు పలకాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన నగరంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వి అనిల్ కుమార్ మాట్లాడుతూ కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం, గ్యారంటీ పెన్షన్ విధానం, యూనిఫైడ్ పెన్షన్ విధానం కార్పొరేట్లకు పెట్టుబడులు సమకూర్చే విధంగా ఉందే తప్ప ఉద్యోగులకు ఎంత మాత్రం ప్రయోజనం లేదన్నారు. వీటిని ఎట్టి పరిస్థితుల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు అంగీకరించబోరన్నారు. జిల్లా కార్యదర్శి చావలి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు సమిష్టిగా కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరముందన్నారు. నవీన్ కుమార్ మాట్లాడుతూ జీవితకాలం ప్రజలకు సేవ చేసిన ఉద్యోగులకు ఇటువంటి కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాలు తీసుకురావడం సమంజసం కాదని, ఉద్యోగుల జీవిత చరమాంకంలో జీవనోపాధి కోసం పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వాల కనీస బాధ్యతన్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దాసరి రామ్మోహనరావు, ఆర్‌విఎస్‌ఎస్ ప్రసాదరావు, జి.వి.రమణ, జి.గోవిందరావు, సిహెచ్ త్రినాథరావు, మురళీధరరావు, నాగేంద్ర, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సదాశివుని శంకరరావు, సీనియర్ నాయకులు కె రాజారావు, వాసుపల్లి రామారావు, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నిరసన తెలుపుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

పొందూరు: యూపిఎస్ విధానం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైనది కాదని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్, శ్రీకాకుళం, విజయనగరం జిల్లా కార్యదర్శులు దుంగ వీరయ్య, ఎలకల ఆదినారాయణ అన్నారు. పొందూరు మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం పాతతాలూకా కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొగదాల రమణారావు, పొన్నాడ తేజేశ్వరరావు, జి.సిగడాం మండల శాఖ అధ్యక్షులు కాయల రమేష్, కార్యకర్తలు అప్పారావు, శ్రీనివాసరావు, రోజా, సతీష్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కవిటి : సిపిఎస్‌కు ముగింపు పలికి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని ఎపి సిపిఎస్‌ఇఎ సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు ఆదివారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎపి సిపిఎస్‌ఇఎ జిల్లా కార్యదర్శి శ్రీరామ్మూర్తి బిసాయి, జిల్లా కౌన్సిలర్ జి.జానకిరావు, మండల అధ్యక్షుడు గార రాంబాబు, ప్రధాన కార్యదర్శి హిమకుమార్, ఉపాధ్యక్షుడు నగేష్, కోశాధికారి జి.వంశి, కార్యవర్గ సభ్యులు భార్గవ్, ప్రకాష్, మొర్రి గోపి, ధర్మారావు పాల్గొన్నారు.

పోలాకి : పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరుతూ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపిసిపిఎస్‌ఇఎ రెడ్డి సూరిబాబు, తలగాన చంద్రశేఖర్, బాడాన రాజు, యు.శ్రీనివాసరావు, బాడాన రాజు, పాల్గొన్నారు.

సోంపేట : తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు ఎ.ఢిల్లీరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, సోంపేట, కంచిలి, మందస మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.తిరుపతిరావు, ఆర్.కామరాజు, కె.షణ్ముఖరావు, ఎస్.కిరణ్‌కుమార్, కె.సుందరరావు, డి.గోవిందరావు, కరుణాకర్, నయన్‌కుమార్ పండా, బి.చక్రధర్, డి.వైకుంఠరావు, పెన్షనర్ సంఘం అధ్యక్షులు టి.జోగారావు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌ఐకి వినతిపత్రం అందేశారు.

ఇచ్ఛాపురం : తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.చాణక్య, మండల ప్రధాన కార్యదర్శి గార రాంబాబు, కర్రి పాపారావు, గుంటుకు శ్రీధర్‌రావు, పి.రమేష్, పి.పాపారావు, మహిళా ప్రతినిధులు సుల్తానా, విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం డిటికి వినతిపత్రం అందజేశారు.

కవిటి : వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పోలాకి : ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి : పాతపెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ముందుగా ఇందిరాగాంధీ కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి నేతాజీ, నాలుగు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.బాబూరావు, జి.శ్రీనివాసరావు, ఎం.మల్లేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, హెచ్.శివప్రసాద్, ధనుంజయరెడ్డి, తాతన్నాయుడు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సినీనటుడు పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వేడుకలను అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను ఈ వేడుకలను ప్రారంభించారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో జరిగిన ఈ వేడుకల్లో అభిమానులు కేకు కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం రక్తదాన శిబిరం, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పంపిణీ, మెగాడ్యాన్స్ పోటీలను నిర్వహించారు. రక్తదాన శిబిరంతో పాటు మొక్కలు పంపిణీ కార్యక్రమాల్లో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి డా.దానేటి శ్రీధర్ హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సినీ రంగంలోనే కాక రాజకీయ రంగంలో అనతి కాలంలోనే తనదైన స్థానాన్ని దక్కించు కున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పాటులో ఆయన కీలకంగా వ్యవహరించి సుపరిపాలనను అందించేందుకు ప్రభుత్వంలో భాగమయ్యారన్నారు. కార్యక్రమంలో వ్యాపార వేత్తలు అందవరపు సంతోష్, ప్రసాద్, చిరంజీవి కుటుంబ సినీ నటులు ప్యాన్స్ పాల్గొన్నారు.

పొందూరు: మండలం లోలుగులో ఆదివారం డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ పాల్గొన్నారు. ఈ శిబిరంలో సుమారు 50మంది జనసైనికులు రక్తదానం చేశారు. వీరికి ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు, మండల అధ్యక్షులు యలకల రమణ, నాయకులు సురేష్, రఘు, ముల్లు హరనాథ్, కామరాజు, జామాన అప్పలనాయుడు, షర్మిలా రాణి, మనోజ్ పాల్గొన్నారు.

పొందూరు : రక్తదానం చేస్తున్న జనసేన నాయకులు

ఆమదాలవలస : పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నిర్వహించే రక్తదాన శిబిరంలో యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ఈ శిబిరంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రక్తదాన శిబిరం వద్ద డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు.

చిన్నారికి గాయాలు

చికిత్స పొందుతున్న చిన్నారి సమీరా

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ బన్నువాడ వద్ద ఆదివారం గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని సమీరా అనే ఐదేళ్ల చిన్నారి గాయపడింది. వెంటనే స్థానికులు టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఆదివారం సెలవు కావడంతో సమీరా రోడ్డుపై ఆడుకుంటుంది. ఈ సమయంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

ఎస్‌జిఎఫ్ ఆర్థికసాయం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కవిటి: 'ఆయువు కోసం ఆరాటం' అంటూ శనివారం ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి దాతలు ఉదారంగా స్పందిస్తున్నారు. ఫోన్ పే ద్వారా కొందరు, నేరుగా మరికొందరు తమకు తోచిన సాయం అందిస్తున్నారు. అందులో భాగంగా ఎస్‌జిఎఫ్ సంస్థ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని బాధితుని కుటుంబ సభ్యులకు రూ.8 వేలు అందించారు. కార్యక్రమంలో బదదకల ఏర్రయ్య, ముత్యాల మణి, సంస్థ సభ్యులు లోల్ల ధనుంజయం, జగదీష్, దుదిష్టి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పొందూరు: పొందూరు యంగ్‌స్టార్ యూత్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నికల అధికారులైన భాషా ఆనంద్‌మోహన్, గుడ్ల చంద్రశేఖర్‌ల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా భాషా ఆనంద్‌మోహన్, అధ్యక్షులుగా కాళ్లకూరి శాంతారాం, ఉపాధ్యక్షులు పాలిశెట్టి సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా ఆట్ల చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా బలివాడ శివకుమార్, కోశాధికారిగా కోరుకొండ విజయ్‌కుమార్, సాహితీ కార్యదర్శిగా గిడిజాల భాస్కరరావు, క్రీడా కార్యదర్శిగా చదువుల శోభన్‌బాబు, జిమ్ కార్యదర్శిగా ధర్మవరపు పోలినాయుడు, సాంఘిక సేవా కార్యదర్శిగా కుమిలి రాజేష్, ముఖ్య సలహాదారులుగా గుడ్ల చంద్రశేఖర్, మొగదాల రమణారావు, అనకాపల్లి రంగారావు, వడగా సూర్యా రావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలిపారు.

పరిశీలిస్తున్న సత్యనారాయణ

తుపాను భవనం పరిశీలన

సోంపేట : మండలంలోని రామయ్యపట్నం మల్టీపర్పస్ తుపాను భవనాన్ని మండల ప్రత్యేక అధికారి ఎస్.కె.విసత్యనారాయణ ఆదివారం పరిశీలించారు. స్థానిక తహశీల్దార్, రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు.

డీడీ కార్యాలయాన్ని తరలించాలి

ప్రజాశక్తి- టెక్కలి

జిల్లా విభజనలో భాగంగా సీతంపేటలోని డిడి కార్యాలయాన్ని శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి తరలించాలన్న ప్రభుత్వ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి డిమాండ్ చేశారు. టెక్కలిలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ డిడి కార్యాలయాన్ని మార్చాలని 2022 ఏప్రిల్ 3న ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇప్పటి వరకు అమలు చేయలేదని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోనే రెండు ఐటిడిఎలు, రెండు డిడి కార్యాలయాలు నడుస్తున్నాయని అన్నారు. జిల్లాలో ఐటిడిఎ కావాలని ఆదివాసీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తే... గత, ప్రస్తుత ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మెళియాపుట్టిలో ఐటిడిఎని ఏర్పాటు చేయాలన్నారు.

పూర్తిస్థాయిలో క్లోరినేషన్

కవిటి: డిఎల్‌పిఒ ఎల్.వి.రమణ కవిటి పంచాయతీ ఆదివారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. పంచాయతీలోని బ్లీచింగ్, సున్నం స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో పంచాయతీలు బ్లీచింగ్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. క్లోరినేషన్ పూర్తిస్థాయిలో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఇఒ జి.వీరభద్రస్వామి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండల కేంద్రం మహేంద్ర డిగ్రీ కళాశాల సమీపంలోని ప్రహరాజపాలెం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని టిడిపి నాయకులు ఆక్రమించుకుంటున్నారని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సర్వే నంబరు-7లో రెండెకరాల ప్రభుత్వ భూమిని చదును చేయడంతో ఆదివారం ఆ స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలోని టేకు చెట్లను కూడా నరికి వేసి ఆ సంపదను ఆక్రమణదారులు దోచుకున్నారన్నారని అన్నారు. అలాగే యధేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలూ చేపడుతున్నారని అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం సూపర్-6 హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు వారికి అధికారం కట్టబెడితే... ఉన్న పథకాలను తొలగిస్తున్నారని ఆరోపించారు. అలాగే మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

నకిలీ ఇళ్ల పట్టాల బాగోతం

మంత్రికి ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి పట్టణం పరిధిలోని మండపా కాలనీలో నకిలీ ఇళ్ల పట్టాల బాగోతం బయటపడింది. స్థలం ఒకరిది అయితే.. పట్టా మరొకరి పేరునఉండడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని పేదలకు ఉచితంగా ఇళ్ల పట్టాలు మంజురు చేయాలనే ఉద్దేశంతో సుమారు మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వం భావించి పేదలకు పట్టాలు మంజురు చేసింది. అప్పట్లో కొంతమంది ఇళ్లు కట్టుకోగా, మరికొంత మంది ఆర్థికభారంతో ఇళ్ల నిర్మించుకోలేదు. కాలక్రమంలో కొందరు తమ స్థలాలను అమ్ముకున్నారు. ఈ నేపథ్యంలో నిజమైన స్థలందారులు ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలకు ముందుకెళ్తే... తమ స్థలం దురాక్రమణ జరిగిందని తెలుసుకుని వాపోతున్నారు. ఒకే సర్వే నంబరుపై ఒకే స్థలం ఇద్దరికి ఎలా మంజూరవుతుంది. వీటిలో నకిలీ పట్టా ఎవరిది, ఒరిజినల్ పట్టా ఎవరిది అనే అంశంపై రెవెన్యూ అధికారులు నిర్ణయం తీసుకోవాలి. కానీ, వారూ పట్టించుకోకపోవడంతో అర్హులైన బాధితులు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలోని టిడిపి నాయకులే నకిలీ పట్టాదారులకు అండగా ఉన్నారనే విషయాన్ని బాధితులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయనా ఆ ప్రాంతానికి చెందిన నాయకులు లేని సమయంలో మండపా కాలనీకి వెళ్లి నకిలీ పట్టాల వ్యవహారంపై ఆరా తీయడం గమనార్హం. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు అండగా నిలవాలని మంత్రి స్వయంగా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు స్పందించకపోవడంతో నకిలీ పట్టాల వ్యవహారంలో వారి పాత్రపైనా సందేహాలను ఆ ప్రాంతీయులు వ్యక్తపరుస్తున్నారు. దీనిపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మంత్రి ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

కుమార్ నాయక్‌కు అవార్డు ప్రదానం

అవార్డుతో సత్కరిస్తున్న వేదిక సభ్యులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని డోకులపాడులో ఆదివారం నిర్వహించిన సాహితీ సాంస్కృతిక వేదిక సౌజన్యంతో నిర్వహించిన సదస్సులో సినీ, రంగస్థల నటుడు డాక్టర్ కుమార్ నాయక్‌కు ఉద్దాన బంధు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వడ్డి సరిత కరుణకుమార్ మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో జానపదాలకు జీవం పోస్తూ, సాహితీ మిత్రులకు ప్రోత్సహిస్తూ, కళాకారులతో, కవులతో మమేకమై కళలను, కళాఖండాలను, కవులను, కళా సంపదను ప్రోత్సహిస్తూ... ఉద్దానంలో అనుబంధాన్ని పెంచుకున్నారని అన్నారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్ష, కార్యదర్శులు లండ రుద్రమూర్తి, కుత్తుమ వినోద్, సిక్కోలు వేదిక అధ్యక్షులు రాపాక ధనరాజు, సాహితీవేత్త, వ్యాఖ్యాత బమ్మిడి సుబ్బారావు, జన జాగృతి వ్యవస్థాపకులు తెప్పల కృష్ణమూర్తి, సాహితీవేత్తలు పువ్వల శివ జ్యోతి, వంకల రాజారావు పాల్గొన్నారు.

ఆకర్షణకు లోనుకావద్దు

ఎంఇఒను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి- కవిటి

చదువుకునే దశలో ఆకర్షణకు లోనుకావొద్దని, అందులోనూ ఇంటర్మీడియట్ దశ కీలకమని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్, ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. కవిటి కళ్యాణి కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు స్థానిక లోల్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కుటుంబ సభ్యుల ఆశలు నెరవేర్చాలని సూచించారు. భవిష్యత్‌లో మీకు గుర్తింపు తెచ్చేది చదువేనని, దానికి ఇప్పటి నుంచే బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాశాల యాజమాన్యం ఎంఇఒకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు, కళ్యాణి ఆంగ్ల పాఠశాల ప్రిన్సిపాల్ బిందుమాధవి, సిఆర్‌పి తులసి పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మోక్షమెప్పుడో?

గుంతల్లో చేరిన వర్షపునీరు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని గ్రామీణ రహదారులకు మోక్షమెప్పుడని ప్రజలు, వాహనదారులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. గత పదేళ్లగా గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలుగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాతమేఘవరం నుంచి బోరుభద్రకి వెళ్లే రహదారి గత పదేళ్లగా మరమ్మత్తులకు నోచుకోలేదు. మరువాడ చిలక కూడలి, కొల్లిపాడు నుంచి ఉదయపురం, లక్కివలస నుంచి గెద్దలపాడు, కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ నుంచి వయా నరసాపురం మీదుగా కోటబొమ్మాళికి, బోరుభద్ర నుంచి ఉదయపురం, బోరుభద్ర నుంచి సంతబొమ్మాళి, కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ నుంచి సంతబొమ్మాళికు, వనవిష్ణుపురం నుంచి ఉమిలాడ, జగన్నాథపురం, పాతమేఘవరం నుంచి నౌపడ వరకు వెళ్లే రోడ్లు గుంతలయమయ్యాయి. వర్షం కురిస్తే చాలు గుంతల్లో నీరు చేరడంతో గుంత ఏదో? రోడ్డు ఏదో తెలియని పరిస్థితి. గత ప్రభుత్వంలో రోడ్లు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కనీసం కొత్త ప్రభుత్వమైనా ఈ రోడ్లపై దృష్టిసారించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కాలువ కాదు రోడ్డే...

రోడ్డు మధ్యలో కాలువలా ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలం పెంట గ్రామ ప్రధాన వీధిలో రహదారి పరిస్థితి ఇది. రెండు రోజుగా చిన్నపాటి వర్షం కురువడంతో గతంలో జల జీవన్ మిషన్ కింద రహదారి గోతులు తీసి వదిలేయడంతో కాలువల్లోకి మట్టి కూరుకుపోయింది. దీంతో రోడ్డుమధ్యలో వర్షపునీరు, కాలువ నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో ఈ రహదారిపై రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, పలుమార్లు గత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా వచ్చి చూసి వెళ్లిపోతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై గ్రామస్తులు స్థానిక కూటమి నాయకులు మక్క నారాయణరావుకు తెలియజేయగా అయన స్పందిస్తూ తొందరలోనే అధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

ఎమ్మెల్యేను కలిసిన ఎంపిపి సావిత్రి, తదితరులు

కొత్తూరు : మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపిపి సవర సావిత్రి ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కలిసి విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ... అభివృద్ధికి ఒకరి కొకరు సహకరించుకుంటూ ముందుకు పోవాలన్నారు. తనవంతు సహాయ సహకారాలూ ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈమె వెంట మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు అగతముడి భైరాగినాయుడు, టిడిపి నాయకులు అరుణ్‌కుమార్, అగతముడి మాధవరావు, మాతల గాంధీ, వలురౌతు వెంకటరావు, చొడవరపు లోకేష్, ముగితి కృష్ణ, టొంపల తిరుపతిరావు, చింతాడ కోటి, నాగల్ల అప్పన్న, నూలు స్వామి, బుచ్చి సోమేష్, వలురౌతు శంకరరావు ఉన్నారు.

వసతులపై వర్సిటీ విద్యార్థినుల హర్షం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డాక్టర్ బిఆర్‌ఎయు విద్యార్థినుల హాస్టళ్లలో ఇటీవల పలు నూతన వసతులు కల్పించారు. ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, బాత్ రూంలు ఆధునీకరణ, నాణ్యమైన భోజన సౌకర్యాల కల్పనతో పాటు నూతనంగా అన్ని గదుల్లో కొత్త మంచాలను ఏర్పాటు చేశారు. ఈ నూతన వసతులపై పాత విద్యార్థినిలతో పాటు నూతన విద్యార్థినిలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో డా.బిఆర్ ఎయు వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజిని, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత తదితరులు హాస్టళ్లను సందర్శించి విద్యార్థినిలతో గడిపారు. వర్సిటీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, అందరూ ఐక్యతగా ఉండాలన్నారు. తమకు మెరుగైన వసతులు కల్పించడంపై విద్యార్థులు విసికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్, హాస్టల్ చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎన్. లోకేశ్వరి, డిప్యూటీ వార్డెన్‌లు డాక్టర్ చిన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు యమునారాణి

ఆమదాలవలస : మండలంలోని కొత్తవలసలో శ్రీకాకుళానికి చెందిన ధరణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో ఎండి జనరల్ మెడిసిన్ డిఎం గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు దానేటి ధరణీష్ బాబు, జనరల్ మెడిసిన్ డిఎం న్యూరాలజీ డాక్టర్ గురుగుబెల్లి యమునా రాణిల ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పేదలకు వైద్యసేవలు అందించి వారికి సంపూర్ణ ఆరోగ్యం కలిగించాలన్న ఉద్దేశంతోనే ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది వ్యాధులను గుర్తించలేక వైద్యానికి దూరమవుతున్నారని, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వలన దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి సకాలంలో వైద్యసేవలు అందించడానికి వీలుంటుందన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వైద్య పరీక్షల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు 200 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో కొత్తవలస సర్పంచ్ ప్రతినిధి మెట్ట ఆనందరావు, ఎంపిటిసి ప్రతినిధి కూటికుప్పల సన్యాసినాయుడు, బొడ్డేపల్లి మన్మధరావు, శేఖర్, జి.రమణ, ధరణి ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐఎఎస్‌లా? ఆర్‌డిఒలా?

సబ్ కలెక్టర్ కార్యాలయం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి నూతన 94వ అధికారి నియామకం కోసం చర్చ జరుగుతుంది. ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా సుదర్శన్‌దొర విధులు నిర్వర్తిస్తున్నారు. టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం 1951లో ఏర్పాటైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 93 మంది అధికారులు టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి విధులు నిర్వహించారు. వీరిలో 22 మంది అధికారులు మాత్రమే ఐఎఎస్‌లు కాగా, మిగిలిన వారంతా ఆర్‌డిఒ స్థాయి అధికారులు విధులు నిర్వహించారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచనల మేరకే టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి 94వ అధికారం నియామకం ఉంటుందన్న వాదన విస్తృతంగా ప్రచారం సాగుతుంది. గడచిన వైసిపి హయాంలో ఇక్కడ ఐఎఎస్ స్థాయి అధికారులే విధులు నిర్వహించారు. ఇప్పుడు ఆ నిబంధన ఉండదని పలువురు అంటున్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం : విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వి.అనంతాచార్యులు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు గోపి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ విధానం రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. తెలుగు, ఒరియాలను సమాంతర కొనసాగించాలన్నారు. నియోజకవర్గంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులు సామాజిక భవనం మంజూరు చేయాలన్నారు. వివిధ రకాల యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. నాడు-నేడు ద్వారా మిగిలిన పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పి.శంకర్, ఉమాశంకర్, వంశి, ధర్మారావు, గోపాలకృష్ణ మాచార్యులు, ఎస్.రాజు, శ్రీరామ్ బిసాయి, భార్గవి, ప్రకాష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటరామన్

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి- పోలాకి

తుపాను కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి, ప్రత్యేక అధికారి ఆర్.వెంకటరామన్ ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మండలంలో తుపాను పరిస్థితిపై తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నీరు నిల్వ కాకుండా చూడాలని, పారిశుధ్య కార్మికులతో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా చేయించాలని సూచించారు. అలాగే నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం పల్లిపేట, డోల గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఉషశ్రీ, ఇఒపిఆర్‌డి పద్మావతి, సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, సర్వేయర్ శ్రీరామ్మూర్తి, ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సుదర్శన్‌దొర

ఇసుక ర్యాంపు పరిశీలన

కొత్తూరు : మండలంలోని ఆకులతంపర ఇసుక ర్యాంపు నుంచి మూడు రోజులుగా లారీల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఇటీవల గ్రామస్తులు అడ్డుకుని మాజీ ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణకు సమాచారం అందించారు. ఆయన స్పందించి ఫోన్‌లో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు శనివారం నాలుగు ఇసుక లారీలను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఆర్‌డిఒ సుదర్శన్‌దొర స్పందించి ఆదివారం ఇసుక ర్యాంపును పరిశీలించారు. ఈ ఇసుక ర్యాంపు నుంచి ఎవరికీ ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ర్యాంపు వద్ద రాత్రి పూట గస్తీ ఏర్పాటు చేశామన్నారు. ఈయనతో పాటు డిటి ఎన్.సత్యనారాయణ, ఆర్ఐ పి.లక్ష్మణరావు, సీనియర్ అసిస్టెంట్ వి.రవికుమార్, విఆర్ఒ జి.శంకరరావులు ఉన్నారు.

దాబాలు, పెట్రోల్‌బంక్‌ల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని దాబాలు, పెట్రోల్ బంక్‌ల వద్ద పక్కాగా సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్ఐ వి.సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దాబాలు, పెట్రోల్ బంకుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాబాలలో అక్రమంగా మద్యం విక్రయాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే దాబాలు వద్ద ఇష్టానుసారంగా వాహనాలను రహదారులపై నిలిపితే చర్యలు తప్పవని నిర్వాహకులకు ఆయన సూచించారు.

జారుడుబల్లను అందజేస్తున్న జనసైనికులు

జారుడుబల్ల వితరణ

ఇచ్ఛాపురం: జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ధర్మపురం జనసైనికులు ఆదివారం పేదలకు అన్నదానం, ఎలిమెంటరీ స్కూల్ పిల్లలకు జారుడు బల్ల అందించారు. గ్రామంలో మొక్కలు నాటారు, వైద్య సిబ్బందికి ఫ్యాన్ ఇచ్చారు. రామకృష్ణ, మురళి పాల్గొన్నారు.

ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

సోంపేట : బహుమతులతో చిన్నారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని భారతీయ స్టేట్‌బ్యాంకు ప్రధాన శాఖలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ఆరో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వదీతించారు. ఆలిండియా స్టేట్‌బ్యాంక్ స్టాఫ్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ జనరల్ సెక్రెటరీ ఎల్.చంద్రశేఖర్, విశాఖపట్నం మాడ్యూల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సుష్మ పిలుపుమేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం రీజనల్ సెక్రటరీ కె.సిహెచ్.వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేకు కట్‌చేసి ఉద్యోగులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా సెప్టెంబర్ 1న ఆవిర్భావ వేడుకలను నిర్వహించు కుంటున్నామన్నారు. ఉద్యోగుల పిల్లల నర్సరీస్థాయి నుంచి పదవ తరగతి వరకు వ్యక్తిత్వ వికాస పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, చిన్నపిల్లలకు ఆటల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టేట్ బ్యాంకు రీజనల్ మేనేజర్ అబ్దుల్ హసీబ్ అమీర్, ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ప్రసాదరావు, ఆఫీసర్ అసోసియేషన్ రీజన్ సెక్రెటరీ కృష్ణ కిషోర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బాపయ్య పాల్గొన్నారు.

సోంపేట: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యాన ఎస్‌బిఐ సిబ్బంది ఫ్యామిలీ పిల్లల్లో సృజనాత్మకతను పెంచే దిశగా ముప్పన ఈశ్వరరావు మాస్టర్ బృందం అధ్యక్షతన ఆదివారం ఫార్మేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన పిల్లలకు బహుమతులు అందజేశారు. సోంపేట యూనియన్ కార్యదర్శి పి.ధనుంజయ అధ్యక్షతన ఇచ్ఛాపురం, పలాస క్లస్టర్ వరకు కార్యదర్శులు, సిబ్బంది వారి పిల్లలు పాల్గొని ఉత్సాహభరితంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. డి.జోగారావు ప్రారంభించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కనకరాజు, సుష్మ, మనోజ్‌కుమార్, ప్రత్యేక ఆహ్వానితులుగా విశ్రాంత ఉద్యోగులు షణ్ముఖ పాణిగ్రాహి, సూర్యారావు, మహిమారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : కేకు కట్ చేస్తున్న రీజనల్ మేనేజరు

నిరసన తెలుపుతున్న మద్యం దుకాణ ఉద్యోగులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

పాతపట్నం : టిడిపి కూటమి ప్రభుత్వం నూతన మద్యం విధానం అమలు చేస్తున్న నేపథ్యంలో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు పాతపట్నం సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. కొన్నేళ్లుగా మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లుగా పనిచేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీతంలో కుటుంబాన్ని పోషించుకుంటున్నామని అన్నారు. నూతన మద్యం విధానంతో కుటుంబాలతో రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కొత్త మద్యం విధానంలోనూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బాలకృష్ణ, ప్రసాద్, సూర్యారావు, గౌరీశంకర్, జీవన్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం అర్బన్: నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలను నిరసిస్తూ సోమవారం నుంచి 6 వరకు సిపిఐ ఆధ్వర్యాన ఆందోళన కార్యక్రమాలు పెద్దఎత్తున చేపడతున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఆదివారం నగరంలోని క్రాంతి భవన్‌లో నిరసన కార్యక్రమాల పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడుతూ రోజురోజుకు నిత్యవసర వస్తువుల ధరలు చుక్కల నంటుతున్నాయని, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని, దీనికి తోడుగా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనేకసార్లు పెంచి సామాన్య ప్రజల నడ్డివిరిచే విధంగా ప్రభుత్వాలు పాలిస్తున్నాయన్నారు. ఒకవైపు కొత్త రేషన్‌కార్డులు మంజూరుకు జనాభా లెక్కలతో ముడిపెడుతూ, కార్డుదారులు మరోసారి ఆధారాలు చూపి రేషన్ కార్డులు పునరుద్ధించుకోవాలని షరతులు పెట్టడం వెనుక రేషన్ కార్డుల కుదించే యోచన ఉందని మండిపడ్డారు. జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్న అధిక ధరలను అరికట్టి, పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా ప్రచార, నిరసన కార్యక్రమాలు పెద్దఎత్తున జరపాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోజ్జాడ యుగంధర్, కొన్న శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు వసంతరావు, రాజేష్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు

పార్కు అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీలోని ముత్యాలమ్మ కోనేరు నెహ్రూ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వజ్జ బాబూరావు అన్నారు. ఈ మేరకు కోనేరులో వరదనీరు మళ్లింపు కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించారు. పార్కు అభివృద్ధిలో భాగంగా పురుషోత్తపురం ఎర్రచెరువు వరద నీటిని పైపులైన్ ద్వారా విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నీరు వృథాగా పెద్దకాలువ మీదగా జగన్నాథసాగరంలోకి కలుస్తోందని అన్నారు. దీనిని మళ్లించి ముత్యాలమ్మ కోనేరులోకి నింపే కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా చేపట్టామన్నారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి మొదటిసారి పార్కును రూపకల్పన చేశామన్నారు. అప్పట్లో ఎంతో అభివృద్ధి చెందినా తరువాత వచ్చిన పాలకులు దీన్ని విడిచిపెట్టారన్నారు. మళ్లీ తాము పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈయన వెంట టిడిపి పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, కౌన్సిలర్ డిక్కల ఆనంద్ ఉన్నారు.

పరిశీలిస్తున్న బాబూరావు

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్థానిక శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 96వ నెల నెలవారీ సాహితీ సమ్మేళనం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు యు. నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తమ రచనలు సమాజాన్ని జాగృతం చేసే విధంగా ఉండాలని, ఇవి భావి తరాలకు స్ఫూర్తి దాయకం కావాలని వక్తలు ఉద్బోధించారు. కార్యక్రమంలో కవులు ఐ.యస్.డి ప్రసాద్ (నడిచే సరస్వతి), తోట గోపాలరావు (యుద్ధం), తంగి ఎర్రమ్మ (అక్షర నీరాజనం), లలితారెడ్డి (తరువులే గురువులు), యు.నాగేశ్వర రావు (స్వాతంత్ర్య దినం), ఆర్.వి.రమణమూర్తి (గురుబ్రహ్మ), గుడిమెట్ల గోపాలకృష్ణ (పెళ్లి), బి.జగన్నాథరావు (విత్తనం - చెట్టు), కె.బాలాజీ రవికిరణ్ (అతడు అతడే), చోడవరం ఈశ్వరరావు (ఎవరి నిర్లక్ష్యమో) కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో శాంతినికేతన్ కళాశాల ప్రిన్సిపాల్ అప్పలరాజు, భాషాభిమానులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న కవులు

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మట్టి వినాయకుని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని అమ్మ దేవస్థానం ఆలయ ధర్మకర్త సనపల శ్రావణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని చీమలవలసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో 20 వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. తన తండ్రి విశ్రాంత ఉపాధ్యాయులు సనపల కృష్ణారావు ఆధ్వర్యంలో గ్రామంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు అలాగే శ్రీకాకుళంతో పాటు మరికొన్ని మండల కేంద్రాల్లో వాహనాలతో ఈ వినాయక విగ్రహాలను ఈ వారం రోజుల పాటు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ మట్టి వినాయకులకు పూజలు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న కృష్ణారావు

అగ్ని అస్త్రం కషాయం తయారు చేస్తున్న రైతులు

అగ్ని అస్త్రంతో చీడపీడల నివారణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

అగ్ని అస్త్రం కషాయంతో పంటకు సోకే చీడపీడలను నివారించవచ్చునని డిజిటల్ ఎల్‌టు సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని నిమ్మతొర్లాడలో యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు ఆధ్వర్యంలో రైతులతో కషాయాన్ని తయారు చేయించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అగ్ని అస్త్రం కషాయాన్ని అన్ని రకాల పంటలపై పిచికారి చేయడం వలన గొంగళి పురుగులు కాయ, కాండం తొలిచే పురుగులను సమర్థవంతంగా నివారిస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో క్షేత్రస్థాయిలో రైతులకు ప్రతిరోజు అందుబాటులో ఉండి వారితో పంటలకు అవసరమైన సస్యరక్షణ పద్ధతులను తెలియజేస్తున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలువురికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని బడేకుప్పన్నపేట కార్యస్థానంగా పనిచేస్తున్న కెపి స్పందన ఫౌండేషన్ సభ్యులు ఆదివారం పలువురికి ఆర్థికసాయం అందించారు. గోటివాడ ప్రసన్నకుమార్ గతేడాది నవంబరులో పెయింటింగ్ పనిచేస్తూ... పరంజ పైనుంచి కిందకి పడిపోయాడు. దీంతో కాలు ఎముక ఇరిగిపోయింది. అది కలవడానికి 8 నెలలు సమయం పడుతుందని డాక్టర్ చెప్పారు. దీంతో కుటుంబం పోషణ కష్టమవుతుంది. విషయం తెలుసుకున్న ఫౌండేషన్‌ను సభ్యులు రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే మలగాం పంచాయతీ సూరాడ వానిపేటకు చెందిన పరిమిల్లి కొర్లమ్మ కొన్నాళ్లుగా అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైంది. దీంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది. నెలకు సరిపడా 25 కేజీల బియ్యం, 25 రకాల నిత్యావసర వస్తువులు, రూ.3 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు షణ్ముఖ మాస్టర్, నరసాపురం సర్పంచ్ దుక్క భూషణ్‌రెడ్డి, మలగా మాజీ సర్పంచ్ బుచ్చ మురళి, శిమ్మన్న, శివారెడ్డి, మల్లేసు, నాగరాజు పాల్గొన్నారు.

అవార్డు మరింత బాధ్యతను పెంచింది

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి 2023-24 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన సేవా కార్యక్రమాలకు కలెక్టర్ నుంచి ప్రశంసా అవార్డు రావడం మరింత బాధ్యత పెంచిందని లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి అధ్యక్షులు జగన్నాథనాయుడు అన్నారు. నగరంలోని సానావీధిలో ఉన్న హారికా కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్ ఆధ్వర్యాన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబరు 4న లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్, రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు వనమహోత్సవంలో భాగంగా బిఎస్ఎన్ఎల్ కార్యాల యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతు న్నట్టు వివరించారు. సెప్టెంబరు 5న పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక మట్టి ప్రతిమల పంపిణీ, 29న రైతుబజారు ఎదురుగా ఉచిత వైద్యశిబిరం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పూర్వపు అధ్యక్షురాలు కరణం శోభారాణి, సెక్రటరీ రౌతు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడులను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో జోనల్ చైర్మన్ చింతాడ కృష్ణమోహన్, సెక్రటరీ మణిశర్మ, ఉపాధ్యక్షులు తర్లాడ అప్పలనాయుడు, కోశాధికారి లక్ష్మీకాంత్, లక్ష్మీపతి, మజ్జి సుమన్, నిహార్‌నాయుడు, కరణం హారక, గొంటి చంద్రమోహన్, గొంటి జ్యోతిర్మయి, తరలి చక్రవర్తి, వాసు తదితరులు పాల్గొన్నారు.


శోభారాణిని సన్మానిస్తున్న జగన్నాథం నాయుడు

మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

సిఐ పర్యటన

పోలాకి : మండలంలో నదీపరీవాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట సిఐ జి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని డోల, గోవిందపురం, పల్లిపేట గ్రామాల్లో ఆదివారం పర్యటించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. రెండు రోజులు గ్రామస్తులెవరూ నదుల్లో దిగడం చేయరాదన్నారు. పిల్లలు, వృద్ధులు, మూగజీవాలు ఇటువైపు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈయనతో పాటు ఎస్ఐ జి.రంజిత్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

బ్యానర్ల తొలగింపు సరికాదు

ప్రజాశక్తి- పాతపట్నం

జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం పుట్టిన రోజును పురస్కరించుకొని నియోజకవర్గంలో పలుచోట్ల కార్యకర్తలు శనివారం బ్యానర్లు ఏర్పాటు చేశారని, అందులో కొన్ని బ్యానర్లను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించడం సరికాదని నియోజకవర్గ నాయకులు కె.భవానీ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు. మమ్మల్ని రాజకీయంగా ఎదుర్కోలేకే బేనర్లను తొలగిస్తున్నారని అన్నారు.

వైఎస్ఆర్ వర్ధంతి విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మాజీ సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సోమవారం నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ ఒక ప్రకటనలో కోరారు. ఇందిరాగాంధీ కూడలిలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు కార్యకర్తలందరూ చేరుకోవాలన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలో అనేక అనాథ మృతదేహాలకు దగ్గర ఉండి అంత్యక్రియలు జరుపుతూ అందరితో ప్రశంసలు అందుకున్న పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ తెలుకుల రామారావు. శనివారం నాడు రాత్రి ఈదుపురం వద్ద బాహుదా నది వద్ద అనాథ మృతదేహం లభ్యమైంది. ఎవరూ లేకపోవడంతో టౌన్ హెడ్ కానిస్టేబుల్ రామారావు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహంతో శ్మశాన వాటిక వెళ్లేందుకు వెనుక అడుగు వేస్తున్నారు. ఈయన మాత్రం మానవతా దృక్పథంతో ముందుకొస్తూ... అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రామారావు

ఆహార పొట్లాల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్ పాఠశాల విద్యార్థులు ఆదివారం కాశీబుగ్గ రామాలయం, బస్టాండ్, ఆర్‌టిసి కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లోని పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఖర్చులకు ఇచ్చిన డబ్బులను దాచుకుంటూ ప్రతనెలా పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నారు. సత్యసాయి విద్యా విహార్ ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న విద్యార్థులు